క్లుప్తంగా

మినీ అంగన్‌వాడీ టీచర్లకు పదోన్నతి

కామేపల్లి: మినీ అంగన్‌వాడీ టీచర్లుగా పని చేస్తున్న ఆరుగురికి మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి పొందారు. మినీ అంగన్‌వాడీలుగా పని చేస్తున్న టి.పద్మ(రాజీవ్‌నగర్), క్రాంతి(హరిశ్చంద్రాపురం), మాలోత్ లక్ష్మి(లచ్చతండా), జి.వరలక్ష్మి(జాస్తిపల్లి), బానోత్ కవిత(పండితాపురం), లక్ష్మి(జయరాంతండా)లకు బుధవారం కొత్తలింగాల ఐసీడీఎస్ కార్యాలయంలో అప్‌గ్రేడ్ చేస్తూ వచ్చిన ఆర్డర్ పత్రాలను సీడీపీఓ దయామణి వారికి అందజేశారు.

ఆటోకాడ్‌పై శిక్షణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు బుధవారం టాస్క్ ఆధ్వర్యాన ఆటోకాడ్‌పై శిక్షణ ఏర్పాటు చేశారు. సంస్థ టెక్నికల్ ట్రెయినర్ ఎస్.షాజు కుమార్ హాజరు కాగా శిక్షణ కళాశాల చైర్మన్ జి.కృష్ణ మాట్లాడుతూ.. తమ విద్యార్థులు చదువు పూర్తికాగానే జీవితంలో స్థిరపడేలా శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.అమిత్ బింధాజ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని బైపాస్ రోడ్‌లో గల హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్న కొండమల్లు శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మరణించగా.. వ్యాపారుల యూనియన్ అధ్యక్షుడు ఎండీ ఫజల్ ఆధ్వర్యాన మృతుడి కుటుంబసభ్యులకు బుధవారం రూ.20వేల నగదు అందించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శెట్టి నాగేశ్వరరావు, కేకే సాయి, ఎం.నాగేశ్వరరావు, రవి, ముంతా వెంకటేశ్వరరావు, నాగ, జానీమియా, ఆనందరావు, కేతనోయిన నాగేశ్వరరావు, వై.వీరభద్రం, రాంరెడ్డి, శేఖర్, సురేష్, విజయ, రాణి, మంగమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: ఓ మహిళ ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సూర్యాపేట జిల్లా నడిగూడెంకు చెందిన కుమారి(39) బుధవారం తన ఇంట్లో ఎలుకల మందు తాగింది. దీంతో కుటుంబీకులు నేలకొండపల్లి సీహెచ్‌సీకి తీసుకురాగా, ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఆమె ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఖమ్మం వైద్యవిభాగం: ఇటీవల ఎర్రుపాలెం ప్రాంతంలోని రైల్వేలైన్ వద్ద గుర్తు తెలియని ఓ వ్యక్తి చనిపోగా రైల్వే పోలీసులు ఖమ్మం ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు తరలించి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు. ఇప్పటివరకు మృతదేహం కోసం ఎవరూ రాకపోవడంతో రైల్వే పోలీసులు అంత్యక్రియల నిమిత్తం ఖమ్మం నగరానికి చెందిన అన్నం ఫౌండేషన్‌ను సంప్రదించారు. ఈ మేరకు బుధవారం అన్నం ఫౌండేషన్, పోలీసులు, వైద్యశాల సిబ్బంది సమక్షంలో మృతదేహాన్ని తరలించి నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామంలో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

'కందాళ' నివాళి


నివాళులర్పిస్తున్న కందాళ ఉపేందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ గ్రామపంచాయతీ పరిధిలోని ముత్యాలగూడెంకు చెందిన మేదరమెట్ల వెంకటయ్య ఇటీవల మృతి చెందగా బుధవారం జరిగిన ఆయన దశదిన కర్మలో మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల శ్రీనివాస్, బెల్లం వేణు, వెంకన్న, జర్పుల లక్ష్మణ్, రవి, అక్కినపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సత్కారం..

ఖమ్మం మామిళ్లగూడెం: సమాజ సేవలో సీనియర్ సిటిజన్స్ పాత్ర కీలకమని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేల చంద్రమోహన్ అన్నారు. సీనియర్ సిటిజన్స్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈమేరకు రిటైర్డు డీఎస్పీ నరసయ్యతో పాటు ఇటీవల నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో వయోవృద్ధుల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన కేదాసు నరసయ్యకు కప్పు, ప్రశంసాపత్రాన్ని అందించి ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంస్థ కార్యనిర్వాహణ అధికారి సూర్యప్రకాశ్‌రావు, ప్రధాన కార్యదర్శి సాధినేని జనార్దన్‌రావు, సభ్యులు అనాశి రాధాకృష్ణ, వీరభద్రం, నాగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

పేరుకే క్యాంటీన్..!

నిరుపయోగంగా మారిన ఖమ్మం మార్కెట్ క్యాంటీన్

- భోజనం చేసేందుకు ఇబ్బంది పడుతున్న రైతులు, వ్యాపార వర్గాలు
- రోడ్ల వెంట, హోటళ్లను ఆశ్రయిస్తున్న వైనం
- పట్టించుకోని పాలకులు



పత్తి మార్కెట్ యార్డులో భోజనం చేస్తున్న కార్మికులు


ఖమ్మం మార్కెట్ పత్తియార్డులో మూసేసిన క్యాంటీన్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతులు, వ్యాపార వర్గాలు, కార్మిక వర్గాలు, ఉద్యోగుల కోసం నిర్మించిన క్యాంటీన్ నిరుపయోగంగా మారింది. రాష్ట్రంలోనే పెద్ద మార్కెట్‌లలో ఒకటైన ఈ మార్కెట్‌కు పంట ఉత్పత్తులను విక్రయించేందుకు జిల్లా రైతాంగంతో పాటు పొరుగున ఉన్న భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ, గుంటూరు జిల్లాలకు చెందిన రైతులు వస్తుంటారు. నిత్యం వేలాది మంది రైతులు తాము పండించిన పత్తి, మిర్చి, అపరాలు వంటి పంట ఉత్పత్తులను ఈ మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

తెరుచుకోని క్యాంటీన్..

పంట విక్రయాల కోసం మార్కెట్‌కు వచ్చిపోయే రైతులకు, మార్కెట్ వర్గాలకు మార్కెట్ కమిటీ నిర్దేశించిన ధరలతో అల్పాహారం, భోజన సౌకర్యం కోసం పత్తి యార్డులో ఓ క్యాంటీన్‌ను నిర్మించారు. ప్రతీ ఏడాది పంటల సీజన్‌లో ఈ క్యాంటీన్‌ను మార్కెట్ కమిటీ కాంట్రాక్టర్‌కు అప్పగించి నిర్వహించే వారు. కానీ గతేడాది కూడా ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించగా.. అతడు నిర్వహించకుండా వదిలేశారు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. పత్తి యార్డులో పూర్తి సౌకర్యాలతో క్యాంటీన్‌ను నిర్మించినా ప్రయోజనం లేకుండా మూతపడి ఉంది. ఇటీవల ఖమ్మం మార్కెట్‌ను సందర్శించిన రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి కూడా క్యాంటీన్ మూసివేత గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. టెండర్లు నిర్వహించి క్యాంటీన్ తెరిచేలా చర్యలు తీసుకోవాలని కూడా అధికారులను ఆదేశించారు. అయినా ఆ దిశగా అడుగులు ముందుకు పడటం లేదు.

నెరవేరని లక్ష్యం..

వివిధ ప్రాంతాల నుంచి రైతులు, వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసే కార్మికులు, వ్యాపార వర్గాలు, గుమస్తాలు, హమాలీలు, ఉద్యోగులకు అల్పాహారం, భోజనాల కోసం ఏర్పాటు చేసిన క్యాంటీన్ లక్ష్యం నెరవేకుండా పోతోంది. దీంతో రైతులు మార్కెట్ వెలుపల రహదార్ల వెంట ఉన్న తోపుడు బండ్లు, బడ్డీకొట్లలో విక్రయించే అల్పాహారం, పలుచోట్ల ఉన్న చిన్నచిన్న హోటళ్లలో భోజనం చేస్తున్నారు. రహదార్ల వెంట దుమ్ముధూళిలో కూర్చొని ఆహారాన్ని తినాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులే గాక వ్యాపారులు, కార్మికులు, గుమస్తాలు, ఉద్యోగులు సైతం కూడా మార్కెట్ వెలుపలకు వెళ్లి టీలు, టిఫిన్లు చేస్తున్నారు. పత్తి సీజన్‌తో పాటు అపరాల విక్రయాలు, మరో యార్డులో మిర్చి విక్రయాలు పెరుగుతున్నప్పటికీ క్యాంటీన్‌ను తెరవకపోవడాన్ని రైతులు, రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఈ మార్కెట్‌లో రూ. 10లకు భోజన సౌకర్యం కల్పించే అంశం మార్కెట్ కమిటీ పరిశీలించింది. కాల క్రమంలో మార్కెట్ కమిటీలు మారిన తర్వాత ఆ అంశం మరుగున పడిపోయింది. స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తే రూ.10లకే భోజన సౌకర్యం కల్పించాలని భావించారు కానీ ఆచరణకు నోచుకోలేదు. తక్కువ ధరకు భోజనం, అల్పాహారం అందించడం దేవుడెరుగు.. అసలు మార్కెట్‌లో నిర్మించిన క్యాంటీన్‌ను నిర్వహించకపోవడం విడ్డూరంగా ఉంది.

రూ.లక్షలు వెచ్చించారు..

లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన క్యాంటీన్ భవనం నిష్ప్రయోజనంగా పడి ఉంది. దీంతో మార్కెట్ కమిటీ పలు విమర్శలకు గురవుతోంది. పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకొచ్చే అన్నదాతలు రహదార్ల వెంట తిరుగుతూ అల్పాహారం తినడం, హోటళ్లకు వెళ్లి భోజనం చేయాల్సిన దుస్థితి ఏంటని స్థానికులు విమర్శిస్తున్నారు. మార్కెట్ కమిటీ కాంట్రాక్టర్‌ను నియమించి క్యాంటీన్‌ను నిర్వహణలోకి తీసుకురావటం వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు, వ్యాపార, కార్మిక వర్గాలు డిమాండ్ చేస్తున్నారు.

బయటే టిఫిన్ చేశా..



పత్తి పంట విక్రయానికి తీసుకొచ్చా. టిఫిన్ చేసేందుకు క్యాంటీన్‌కు వెళ్తే మూసి ఉంది. పత్తి బస్తాలను వదిలేసి మార్కెట్ వెలుపలికి వెళ్లి రహదారిపై ఓ తోపుడు బండి వద్ద టిఫిన్ చేశా. భోజన సౌకర్యం దగ్గరలో ఎక్కడా లేదు. దేనికైనా మార్కెట్ బయటకే వెళ్లాల్సి వస్తుంది. మార్కెట్‌లో క్యాంటీన్ ఉంటే బాగుండేది.

– దువ్వల భాస్కర్‌రావు, రైతు, గోవింద్రాల, బోనకల్ మండలం

క్యాంటీన్ తెరవాలి..



క్యాంటీన్ తెరిస్తే సౌకర్యవంతంగా ఉంటుంది. నిత్యం వేలాది మంది రైతులు, కార్మికులు, వ్యాపారులు ఈ మార్కెట్‌కు వచ్చి పోతుంటారు. వీరు ఏదైనా తినాలన్నా.. తాగాలన్నా క్యాంటీన్ లేకపోవడంతో బయటకు వెళ్లాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో రేయింబవళ్లు కార్మికులు పనిచేయాల్సి వస్తుంది కాబట్టి మార్కెట్‌లో క్యాంటీన్‌ను ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలి.

– వెంకన్న, మార్కెట్ కార్మికుడు, ఖమ్మం

చర్యలు తీసుకోవాలి..



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో క్యాంటీన్ నిర్వహణలో ఉంటే అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం. రైతులు తమ పంటను చూసుకుంటూ అందుబాటులో ఉన్న క్యాంటీన్‌లోనే అల్పాహారం తింటారు. క్యాంటీన్‌లో నిర్దేశించిన ధరలకు నాణ్యమైన భోజనం కూడా చేస్తారు. ఇప్పటికైనా అధికారులు మార్కెట్‌లో క్యాంటీన్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలి.

– నీలమ్మ, కార్మికురాలు, ఖమ్మం

క్యాంటీన్ నిర్వహణకు కృషి..

రైతులు, కార్మికులు, వ్యాపార, ఉద్యోగ వర్గాల సౌకర్యం కోసం మార్కెట్‌లోని పత్తి యార్డులో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను నిర్వహణలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. కాంట్రాక్టర్లు ముందుకొస్తే వెంటనే నిర్వహణ చర్యలు చేపడతాం. మార్కెట్ కమిటీతో చర్చించి తగిన ప్రణాళికలు రూపొందించి త్వరలోనే ప్రారంభిస్తాం.

– బి.బజార్, గ్రేడ్–2 కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్, ఖమ్మం

నగరంలో పర్యటించిన మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. స్థానిక 43వ డివిజన్ నెహ్రూనగర్‌లో ఆరోగ్య ఆస్పత్రి అధినేత డాక్టర్ మోపర్తి సుమంత్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన ఇంట్లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఖిల్లాలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఖాదర్‌బాబా, ముక్రమ్ ఇంట్లో తేనేటి విందులో పాల్గొన్నారు. 48వ డివిజన్ రాపర్తినగర్‌లోఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన శెట్టి రంగారావు అన్న సుధాకర్ చిత్రపటానికి నివాళులర్పించి, రంగారావును పరామర్శించారు. అలాగే 13వ డివిజన్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుత్తా వెంకటేశ్వరరావు తండ్రి అనంతరామయ్యను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్, కార్పొరేటర్లు లకావత్ సైదులు, మలీదు వెంకటేశ్వర్లు, మలీదు జగన్, రావూరి కరుణ సైదుబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'గ్రేస్' ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం

రఘునాథపాలెం: మండలంలోని శివాయిగూడెం, పువ్వాడనగర్ పంచాయతీల్లో హైదరాబాద్‌కు చెందిన గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్, ఖమ్మంకు చెందిన గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాస్టర్ లేగల జీవరత్నం అధ్యక్షతన జరిగిన ఈ శిబిరాన్ని తహసీల్దార్ విల్సన్ బెన్నీ ప్రారంభించగా.. వివిధ రకాల కేన్సర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత రవి, ఎస్.కే.సిద్దిక్, ఎం.తిమోతీ, మంద సంజీవరావు, జయరాజు, వైద్యులు జన్ను సంజీవరావు, విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.

రైతును కాటేసిన పాము

నేలకొండపల్లి: వ్యవసాయం పనుల్లో నిమగ్నమైన ఓ రైతును పాము కాటేసింది. మండలంలోని అనాసాగారానికి చెందిన రైతు ఉపేందర్ బుధవారం వ్యవసాయం పనులు చేస్తుండగా కాలిపై పాము కాటేసింది. దీంతో సహచర రైతులు నేలకొండపల్లి ఆస్పత్రిలో చికిత్స చేయించాక ఖమ్మం తరలించారు.

మంత్రి పొంగులేటికి శుభాకాంక్షల వెల్లువ


మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

కూసుమంచి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం కూసుమంచిలోని తన అధికారిక నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా మంత్రికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో పాటు నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలను తెలిపారు. పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్లను మంత్రి ఆవిష్కరించారు.

'చాంబర్' ప్రతినిధుల సత్కారం..

ఖమ్మంవ్యవసాయం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బుధవారం ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి వర్గం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షులు సోమా నర్సింహారావు(జీవై నరేష్), సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, సెంట్రల్ ఈసీ సభ్యులు విడాల శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి నగదు అందజేత..

కూసుమంచి: ముఖ్యమంత్రి సహాయ నిధికి కూసుమంచికి చెందిన సర్పంచ్ చెన్నా మోహన్, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, వర్తక సంఘం అధ్యక్షుడు చౌడవరపు కృష్ణారావు ఒక్కొక్కరు రూ.5వేల చొప్పున అందజేశారు. బుధవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెక్కులు అందజేశారు. మంత్రి పొంగులేటి తన కోసం బొకేలు, శాలువాలు, ఫ్లెక్సీల ఏర్పాటు చేయకుండా అట్టి ఖర్చును ముఖ్యమంత్రి సహాయనిధికి అందించాలని ఇటీవల కోరడంతో ఈమేరకు వారు చెక్కులను అందించారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం..


విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్న మంత్రి

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం శివకుమారి ఆధ్వర్యాన బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల ఉపాధ్యాయులు సన్మానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతగా వారిని సన్మానించినట్లు తెలిపారు. ఈనేపథ్యాన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల కోసం కంప్యూటర్ ల్యాబ్ మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దండి సురేష్, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

మల్లు నందిని వ్యాఖ్యలను వక్రీకరించొద్దు..

ఖమ్మంవన్‌టౌన్: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని ఓ చానల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు వక్రీకరిస్తున్నారని, మరోసారి ఇలా జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య హెచ్చరించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అమ్మ ఫౌండేషన్ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు మల్లు నందిని గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్న భట్టి విక్రమార్క సీఎం అయితే బాగుండేదని అనడంలో తప్పులేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు స్వరూప, గీతా, ద్రౌపది, బిక్కసాని స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రాత్రనక.. పగలనక..

కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ

రఘునాథపాలెం: మండలంలోని 40 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజల నుంచి ప్రజా పాలన ద్వారా వచ్చిన దరఖాస్తులను అధికారులు రాత్రనకా.. పగలనకా దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. గత మూడు రోజులు నుంచి ఇలాగే కొనసాగిస్తూ మొత్తం 21,800పైగా దరఖాస్తుల్లో బుధవారం నాటికి 17 వేలకుపైగా ఆన్‌లైన్ అయినట్లు తహసీల్దార్ తెలిపారు. తహసీల్దార్ విల్సన్‌బెన్నీ, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డిల పర్యవేక్షణలో ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతుండగా.. శుక్రవారం నాటికి పూర్తవుతుందని తెలిపారు.

నేలకొండపల్లిలో 65 శాతం పూర్తి..

నేలకొండపల్లి: మండలంలోని 32 గ్రామ పంచాయతీల నుంచి 22 వేల దరఖాస్తులు అందాయి. వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించేందుకు మండల స్పెషల్ ఆఫీసర్ డీ.వీ.రమణ, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివలు ప్రత్యేక చొరవ తీసుకునిఆన్‌లైన్ పనులను యుద్ధప్రాతిపదికన చేయిస్తున్నారు. ఇప్పటి వరకు 13 వేల దరఖాస్తులు నమోదు చేయించారు.


నేలకొండపల్లిలో డేటా ఎంట్రీ నమోదును పరిశీలిస్తున్న అధికారులు

జ్యుయెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఆభరణాలను పరిశీలిస్తున్న మేయర్

ఖమ్మంగాంధీచౌక్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్‌లో లక్ష్మీశ్రీనివాస జ్యుయెలరీస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన లైట్ వెయిట్ గోల్డ్, సిల్వర్ జ్యుయెలరీ ఎగ్జిబిషన్‌ను బుధవారం నగర మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న బంగారం ధరను దృష్టిలో పెట్టుకొని సామాన్యులకు కూడా అందుబాటులో ఉండేలా ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం అభినందనీయమని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 16 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దుగ్గి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎన్.స్వరూపారాణి, లక్ష్మి, భవ్యశ్రీ, అద్వైత్ తదితరులు పాల్గొన్నారు.

'ట్రస్మా' నూతన కమిటీ ఎన్నిక


ఉపాధ్యక్షులు అశోక్‌రెడ్డి, వెంకటేశ్వరరావు


కోఆర్డినేటర్ శశిధర్

ఖమ్మంఅర్బన్/కామేపల్లి: తెలంగాణ రికగ్నైజేషన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ పాఠశాల కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి, కామేపల్లి మండలం కొత్తలింగాల శ్రీసాయి వివేక భారతి పాఠశాల కరస్పాండెంట్ కొమ్మినేని వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్‌గా వండర్ కిడ్స్ కరస్పాండెంట్ కొండపల్లి శశిధర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నగరంలోని విన్‌ఫీల్డ్ స్కూల్‌లో జరిగిన జిల్లా టెస్మా(టీఆర్‌ఎస్‌ఎంఏ) సమావేశంలో వారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని జిల్లా అసోసియేషన్ పెద్దలు కేశా వీరన్న, ముద్దా శ్రీనివాసరావు, కాంతారావు, శ్రీకాంత్, తదితరులు అభినందించగా.. వెంకటేశ్వరరావును కామేపల్లి పాఠశాలలో ఉపాధ్యాయ బృందం సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రాజ్యలక్ష్మి, సిబ్బంది అనిత, ఉమాదేవి, సుమ, మాధురి, కనకమహాలక్ష్మి, రజిత, కృష్ణవేణి, పర్వీన్ పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి



కూసుమంచి: మాట్లాడుతున్న మహబూబ్ అలీ

ఖమ్మం సహకారనగర్/కూసుమంచి: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ మహబూబ్ అలీ, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావులు డిమాండ్ చేశారు. సంఘం ఖమ్మం నగర శాఖ పదో మహాసభ బుధవారం జరగగా నాగేశ్వరరావు, కూసుమంచిలో జరిగిన మండల మహాసభలో మహబూబ్ అలీలు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టదాయకంగా ఉన్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయడమే కాక ఎన్నికల సమయాన ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అలాగే, సర్వశిక్ష, కేజీబీవీ, గురుకులాల కాంట్రాక్టు ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని, సర్వీస్ రెగ్యులర్ చేసి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు బుర్రి వెంకన్న మాట్లాడగా.. పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. ఈసమావేశంలో ఉడల నర్సింహారావు, షేక్ ఉద్దండ్ షరీఫ్, చాట్ల రోజా, నవీన్‌కుమార్, నాగరాజు, సాంబమూర్తి, మహ్మద్ షరీఫ్, సాంబశివరావు, షాబుద్దీన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే కూసుమంచిలో సీనియర్ కార్యకర్త భిక్షపతి పతాకావిష్కరణ చేయగా.. ఈ సభలో జిల్లా కార్యదర్శి నర్సయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికిరణ్, కృష్ణారావు, బాధ్యులు విక్రంరెడ్డి, శ్రీనివాసరావు, రాణి, సుభాషిణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నేలకొండపల్లి: రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.వెంగళరావు కోరారు. మండల కేంద్రంలో బుధవారం సంఘం క్యాలెండర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖమ్మంలో ఫ్రిబవరి 11, 12, తేదీల్లో టీపీటీఎఫ్ నిర్వహించే సభకు విద్యా వేత్తలు హాజరవుతారన్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు పెద్ది జగన్నాథం, టి.గోవిందరావు, రవికిశోర్, హనుమంతరావు, బి.రామారావు, చీనా, బి.రవి, వీరభద్రం, ఎం.హనుమంతు, టి.వెంకన్న, బీ.వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను..

కూసుమంచి: సంక్రాంతిని పురస్కరించుకుని పీఎస్‌ఆర్ (పొంగులేటి శ్రీనివాసరెడ్డి) లీగ్–1 కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెంమండలాల స్థాయి క్రికెట్ పోటీలు 12వ తేదీ నుంచి కూసుమంచిలోని హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రారంభమవుతాయని, ఈ పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకులు తెలిపారు. బుధవారం పోటీల కరపత్రాలను పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. మొదటి బహుమతిగా రూ.20,116, రెండో బహుమతిగా రూ.15,116, మూడవ బహుమతిగా రూ.10,116, నాల్గవ బహుమతిగా రూ.5,116 అందించబడుతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, పోటీల నిర్వాహకులు ఎండీ.రఫీ, ఉపేందర్, సంద్రరవి, మహిపాల్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

నేలకొండపల్లి: వాసవీ క్లబ్ గ్రేటర్, వనిత భక్తరామదాసు, కన్యాకపరమేశ్వరీ ఆధ్వర్యాన సంతూర్ సౌజన్యంతో ఉదయ్ సాయి ఏజెన్సీ ప్రోపరేటర్ మాటూరి సుబ్రహ్మణ్యం సమక్షంలో బుధవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. మండల స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన కొమ్మినేని శ్రీదేవికి మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి బహుమతి అందించారు. ఎంపీటీసీ కల్పన, క్లబ్స్ ప్రతినిధులు సుజాత, నాగేశ్వరరావు, షరాబు పవన్, నారాయణరావు, కరుణ, పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

ఖమ్మంమయూరిసెంటర్: కారేపల్లి మండలం సీపీఎం కార్యాలయంపై అటవీ శాఖ అధికారుల దాడులను నిరసిస్తూ బుధవారం ఖమ్మం నగరంలో పార్టీ ఆధ్వర్యాన దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కారేపల్లిలో సీపీఎం కార్యాలయంలో జరుగుతున్న సమావేశంలో పోడు సాగుదారులున్నారనే నెపంతో పోలీసు, ఫారెస్ట్ అధికారులు కార్యాలయం ముందు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ ఘటనపైన జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు చొరవ తీసుకొని విచారణ జరిపి అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యుడు మెరుగు సత్యనారాయణ, నందిపాటి మనోహర్, ఎస్.నవీన్‌రెడ్డి, ఆర్.ప్రకాశ్, ఎస్‌కె.బషీర్, నాయకులు కె.అమరావతి, చింతల రమేశ్, సుధాకర్, చిరంజీవి, భిక్షం, పుల్లారావు, భారతమ్మ, రామారావు, కొండల్‌రావు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరణ

తిరుమలాయపాలెం: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) డైరీ, క్యాలెండర్లను మండల నోడల్ అధికారి మంత్రిప్రగడ శ్రీనివాసరావు, పిండిప్రోలు హైస్కూల్ హెచ్‌ఎం ఎ.లక్ష్మిసుజాత బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నూతన విధానంలో వస్తున్న మార్పులపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.వీ. నాగేశ్వరరావు, మండల అధ్యక్ష,కార్యదర్శులు వెంకట్రాములు, వీరభద్రం, మండల బాధ్యులు ప్రభాకర్‌రావు, శ్రీదేవి, కస్తూరి, గుండా శ్రీనివాస్, స్వరూపరాణి, యస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన..

ఖమ్మం మామిళ్లగూడెం: గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ నగర శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం అజీజ్‌గల్లీలోని సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఆర్గనైజర్ హఫ్సా మేహీన్, కుబ్రా, నాజనీన్, ఫరీజ్, ఫర్హీనా తదితరులు పాల్గొన్నారు.